epaper.tcnewsdaily.com
www.tcnewsdaily.com

# తెలంగాణ చౌరస్తా

వాయిస్ ఆఫ్ డెమోక్రసీ

సంపుటి: 01
సంచిక:11

24 క్యారెట్లు 80,215.00 | కిలో వెండి 1,07,000.00 | tcnewsdaily | 04.08.2025 సోమవారం, హైదరాబాద్


## ఆపరేషన్ సిందూర్ కొత్త చరిత్రను సృష్టించింది

- సిందూర్‌కు చాలా దేశాలు ఇండియాకు మద్దతిచ్చాయి
- భారతదేశం ఏ దేశం మీద కావాలని దాడి చేయదు
- ఆత్మరక్షణ కోసం మాత్రమే దాడి చేస్తుంది
- గచ్చిబౌలిలో సెల్యూటింగ్ అవర్ హీరోస్ కార్యక్రమంలో వెంకయ్యనాయుడు



**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో:** భారతదేశం సంస్కృతి, సంప్రదాయాలకు నిలయమని మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు వ్యాఖ్యానించారు. భారతదేశం ఏ దేశం మీద కావాలని దాడి చేయదని.. ఆత్మరక్షణ కోసం మాత్రమే దాడి చేస్తుందని

5లో



# లిల్లిపుట్ రాజకీయం

- సొంత పార్టీ నేతలపై కవిత తీవ్ర ఆవేదన
- కేసీఆర్‌కు రాసిన లేఖను లీకు చేసిందెవరో చెప్పాలని డిమాండ్
- లిల్లిపుట్ అంటూ జగదీశ్‌రెడ్డిపై ఫైర్
- తీన్మార్ మల్లన్న వ్యాఖ్యలను ఎవరూ ఖండించ లేదంటూ ఆగ్రహం
- కనీసం ఫోన్‌లోనైనా పరామర్శించాలి కదా..?' అంటూ భావోద్వేగం
- రక్త సంబంధం కంటే రాజకీయ సంబంధమే వారికి ముఖ్యమా?
- విలేకర్ల సమావేశంలో తీవ్ర స్థాయిలో విమర్శలు
- నేటి నుంచి ఇందిరాపార్కు వద్ద దీక్ష

" ఒకవైపు ఆవేదన.. మరోవైపు అసంతృప్తి... వెరసి తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత తీవ్ర మనో వేదనకు గురవుతున్నారు. సొంత పార్టీ నేతలు తన పట్ల అనుసరిస్తున్న ధోరణిపై ఆమె అసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే తన పట్ల, తన ఉద్యమాల పట్ల చేసిన వ్యాఖ్యలపై కవిత తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నల్లగొండ జిల్లాలో పార్టీ ఓటమికి కారణమైన లిల్లిపుట్ నాయకుడు నా గురించి మాట్లాడుతారా? కేసీఆర్ లేకుంటే ఆ లిల్లిపుట్ ఎవరు?' అంటూ ఆయన్ను దుయ్యబట్టారు.

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:** ఆదివారం హైదరాబాద్‌లోని తన నివాసంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆమె ఈ కామెంట్లు చేశారు. ఇటీవల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న తనపై చేసిన వ్యాఖ్యలను బీఆర్ఎస్ నేతలెవ్వరూ ఖండించకపోవటంతో కవిత తీవ్ర భావోద్వేగానికి గురయ్యారనీ, ఇప్పటికే ఆ విషయం గురించి పదేపదే ఆలోచిస్తున్నారని ఆమె సన్నిహితులు చెబుతున్నారు. 'రక్త సంబంధం కంటే రాజకీయ సంబంధమే వారికి ముఖ్యమా? మల్లన్న చేసిన వ్యాఖ్యల గురించి నన్ను నేరుగా పరామర్శించేందుకు రాలేదు, అయినా ఫరవాలేదు,

2లో



# మీ జ్ఞానానికి నా జోహార్లు

- కవిత వ్యాఖ్యలను జగదీష్ రెడ్డి కౌంటర్
- కేసీఆర్‌కు బద్ధ శత్రువుల భాషే మీది
- రేవంత్ రెడ్డి, రాధాకృష్ణ మాట్లాడిందే..కవిత అన్నారు
- నేను చావుతప్పి కన్నులొట్టబోయినట్లు గెలిచిన
- మరి కవిత అసలే గెలవలేదు కదా
- నేను పార్టీకి సైనికుడిని
- కేసీఆర్‌ను ఈ మధ్య కాలంలో 50సార్లు కలిశాను
- కవిత గురించి చర్చ రాలేదు:ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి

" నా ఉద్యమ ప్రస్థానానికి సంబంధించి వారికి ఉన్న జ్ఞానానికి నా జోహార్లు అని సూర్యాపేట బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్‌కు బద్ధ శత్రువులుగా ఉన్న వాళ్ళు, బీఆర్ఎస్ పార్టీని ఖతం చేయాలని చూస్తున్న రేవంత్ రెడ్డి, రాధాకృష్ణ ఏం మాట్లాడుతున్నారో వారు అదే మాట్లాడుతున్నారు అని జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు.

**తెలంగాణ చౌరస్తా స్టేట్ బ్యూరో:** కవిత ఉపయోగించిన పదాలను రేవంత్ రెడ్డి, రాధాకృష్ణ ఉపయోగించారు. వాళ్ళు ఉపయోగించిన పదాలను కవిత వల్లెవేస్తున్నారు. నల్గొండ జిల్లాలో 25 ఏళ్లల్లో జరిగిన ఉద్యమాలకు, గెలుపుకు నేను భాద్యత అయితే ఓటమికి నేను భాద్యుడను. పార్టీ అంతిమంగా ఫైనల్. వ్యక్తులుగా ఏదో చేస్తామని అంటే వారి భ్రమ. కొంతమంది ఏదో చేస్తామని ఊహించుకుంటున్నారు అని జగదీశ్ రెడ్డి తెలిపారు. నేను పార్టీకి సైనికుడిని. నేను కేసీఆర్‌ను ఈ మధ్య కాలంలో 50సార్లు కలిశాను. వారి గురించి చర్చ రాలేదని నేను చెప్పాను. వారి గురించి మాట్లాడటం వృధా అని

2లో



## కాంట్రాక్టర్ల కోసమే కాళేశ్వరం

- రిపోర్ట్ అనంతరం దోషులకు కఠినంగా శిక్ష
- కాళేశ్వరం ప్రాజెక్టు పంపింగ్ ఫెయిల్
- ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నాం
- కేసీఆర్‌పై మంత్రి వివేక్ ధ్వజం

2లో

## మైనర్ బాలుడితో పరారైన వివాహిత

### ఖమ్మం జిల్లాలో విచిత్రమైన సంఘటన

- మహిళపైనే పోక్సో కేసు నమోదు.. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం
- సత్తుపల్లిలో స్థానికంగా నివసిస్తున్న ఓ వివాహిత
- అదే ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల మైనర్ బాలుడితో ప్రేమ
- ప్రేమలో ఆ బాలుడిని తీసుకుని పరారు



**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో:** తెలంగాణలోని ఖమ్మం జిల్లాలో ఓ విచిత్రమైన సంఘటన వెలుగులోకి వచ్చింది. సాధారణంగా బాలికలపై లైంగిక వేధింపులు జరిగిన తరుణంలో.. నిందితుడిపై పోక్సో చట్టం (POCSO Act) నమోదు చేసిన ఘటనలు చాలానే చోటు చేసుకున్నాయి. కానీ ఈసారి మాత్రం ఓ మహిళపైనే పోక్సో కేసు నమోదు అవ్వడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనంగా మారింది.ఈ అనూహ్య ఘటన సత్తుపల్లి పట్టణంలో జరిగింది. స్థానికంగా నివసిస్తున్న ఓ వివాహిత.. భర్తతో విడాకులు తీసుకుంది. ప్రస్తుతం అదే ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల మైనర్ బాలుడితో ప్రేమలో పడింది. కొంతకాలం ప్రేమలో కొనసాగిన

2లో

## ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు కర్రుకాల్చి వాతపెట్టాలి

- జూబ్లీహిల్స్ మళ్లీ గులాబీ జెండా ఎగరాలి
- కాంగ్రెస్ వచ్చాక సంక్షేమ పథకాలు ఆగిపోయాయి
- మోసగాళ్లకు, మోసగాళ్ల పార్టీ కాంగ్రెస్
- నియోజకవర్గం కార్యకర్తల సమావేశంలో
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

2లో



## పాలనలో మహిళా సాధికారతకు ప్రాధాన్యం

- ప్రజలకు చేరువయ్యేందుకే పాదయాత్రలు చేస్తున్నాం
- కష్టపడే కార్యకర్తలకు పదవులు ఇస్తాం
- కొత్తవారు వచ్చినా పాత నేతలకు ప్రాధాన్యం
- బీఆర్ఎస్‌వి కుల రాజకీయాలు
- బనకచర్ల ప్రాజెక్టుపై కేటీఆర్, హరీష్‌రావు అబద్ధాలు
- నిజామాబాద్‌లో కాంగ్రెస్ ముఖ్య నేతల సమావేశం
- మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు

**తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో:** స్థానికల సంస్థల ఎన్నికలపై టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ కీలక వ్యాఖ్యలు చేశారు. సర్వే ఆధారంగా స్థానిక ఎన్నికల్లో గెలిచే వారికే సీట్లు ఇస్తామని స్పష్టం

5లో





## కార్పోరేట్ విద్యలో మరో విద్యార్థి మృతి

### కాలేజీలో చేర్చే ముందు కొంచం ఆలోచించండి

- నాకు ఈ చదువు అర్థం ఐతలే .. మీకు చెప్తే మీరు అర్థం చేసుకోవట్లే
- నాలాగా కాకుండా మంచిగా చదువుకో అంటూ లేఖ
- కార్పోరేట్ కబంధ హస్తాల్లోకి విద్యా వ్యవస్థ
- ఒత్తిడి తట్టుకోలేకనో... చదువులో రాణించాలేకనో విద్యార్థులు వరుసగా ఆత్మహత్యలు
- విద్యార్థినీ మృతి పట్ల అనుమానాలు
- కళాశాలపై చర్యలు తీసుకోవాలని విద్యార్థిసంఘాల డిమాండ్

**హనుమకొండ, తెలంగాణ చౌరస్తా:** విద్యార్థులు స్వేచ్ఛాయుత వాతావరణంలో వారి లక్ష్యాలను సాధించేందుకు, వారు కలలను సాకారం చేసుకుని ముందుకు సాగాల్సింది పోయి చిన్న వయసులోనే ఆత్మహత్యలు చేసుకుంటున్నారంటే నేడు ఎంత ఒత్తిళ్లకు లోనవుతున్నారనో అర్థం చేసుకోవచ్చు. విద్యను వ్యాపారంగా మార్చుకుని లక్షల్లో ఫీజులు వసూలు చేసుకుంటూ విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తూ విచ్చలవిడిగా బ్రాంచ్ లు ఏర్పాటు చేసుకుని విద్యను కార్పోరేట్ కబంధ హస్తాల్లోకి తీసుకున్న క్రమంలో విద్యార్థులు తీవ్రమైన ఒత్తిళ్లకు లోనై వారి సమస్యల్ని కన్న తల్లిదండ్రులకు కూడా చెప్పాలని స్థితిలో ఉన్నారంటే ఏ స్థాయిలో కార్పోరేట్ వ్యవస్థ ప్రభావం చూపుతుందో తెలుస్తుంది.రాజకీయ నాయకుల అండదండలతో

2లో

## ఉమ్మడి భార్య అక్కడి సంప్రదాయం

- హిందూ పురాణాల్లో ద్రౌపది మాదిరి ఆచారం
- హిమాచల్‌ప్రదేశ్‌లోనూ, ఉత్తరాఖండ్
- హత్తి గిరిజన తెగ వారు దీన్ని తరాలుగా అనుకరణ
- తమిళనాడు తోడా గిరిజనులు కూడా ఈ బహు భర్తృత్వాన్ని పాటిస్తారు.
- మొన్న ఈ మధ్య సునీత చౌహాన్, కపిల్ నేగి, ప్రదీప్‌లు
- మూడు రోజులపాటు అట్టహాసంగా పెండ్లి

5లో



# లిల్లిపుట్ రాజకీయం

తరువాయి భాగం

కనీసం ఫోన్‌లోనైనా పరామర్శించాలి కదా..?' అంటూ ఆమె కంటతడిపెట్టినట్టు తెలిసింది. తీన్మార్ మల్లన్న వ్యాఖ్యల వెనుక బీఆర్ఎస్‌లోని పెద్ద తలకాయలు, పొడుగు నేతల హస్తముందంటూ ఆమె ఒక మాజీ మంత్రిని ఉద్దేశించి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరెవరు మల్లన్నను కలిశారో, ఆయనతో ఏం చెప్పారో, ఎలాంటి వ్యాఖ్యలు చేయించారోననే విషయాలన్నీ తనకు తెలుసునని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా మీడియా సమావేశంలో కవిత మాట్లాడుతూ... తన తండ్రి కేసీఆర్‌కు తాను రాసిన లేఖను లీకు చేసిందెవరో చెప్పాలని పార్టీ అధిష్ఠానాన్ని డిమాండ్ చేశారు. బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ తనకు తెలుసుగానీ, గత ఆర్నెల్ల నుంచి ఆయనతో మాట్లాడలేదని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. బీసీ రిజర్వేషన్లకు సంబంధించి సోమవారం నుంచి ఇందిరాపార్కు వద్ద తాను చేపట్టబోయే దీక్షకు రాష్ట్ర ప్రభుత్వం అడుగడుగునా ఆటంకాలు సృష్టిస్తోందని కవిత వాపోయారు. 'దీక్షకు అనుమతినిస్తే సరే... లేదంటే ఇంటి నుంచే దీక్ష చేపడతా...' అని హెచ్చరించారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో బీజేపీ వైఖరి... 'దొంగే, దొంగా దొంగా... అని అరిచినట్టుగా ఉంది...' అని ఎద్దేవా చేశారు. ఈ అంశంపై రాష్ట్ర ప్రభుత్వానికి, సీఎం రేవంత్‌కు నిజంగా చిత్తశుద్ధి ఉంటే వెంటనే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకుపోవాలని డిమాండ్ చేశారు. సోమవారం నుంచి మూడు రోజుల పాటు (72 గంటలు) ఇందిరాపార్కు వద్ద ధర్నా నిర్వహించనున్నట్టు ఆమె తెలిపారు.

# మీ జ్ఞానానికి నా జోహార్లు

తరువాయి భాగం

చెప్పాను అంతే. కేసీఆర్‌తో బనకచర్ల, వ్యవసాయ రంగానికి సంబంధించిన అంశంపైనే చర్చించాము. కేసీఆర్ లేకపోతే ఎవరం లేము. అందులో ఎలాంటి సందేహం లేదు. నేను చావు తప్పి కన్నులొట్టబోయినట్లు గెలిచిన.. కానీ కొంతమంది గెలవలేదు కదా. కవితపై తీన్మార్ మల్లన్న చేసిన వ్యాఖ్యలు నా దృష్టికి రాలేదు. నేను చూడలేదు



నేను చూసిఉంటే స్పందించేవాడిని అని జగదీశ్ రెడ్డి పేర్కొన్నారు.



# మైనర్ బాలుడితో పరారైన వివాహిత

తరువాయి భాగం

అనంతరం.. ఆ బాలుడిని తీసుకుని పరారైంది. దీంతో తమ కుమారుడు కనిపించకపోవడంతో.. బాలుడి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు.. మహిళే బాలుడిని తీసుకెళ్లినట్లు గుర్తించారు. మహిళపై POCSO చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు వెల్లడించారు. త్వరలోనే ఆమెను అరెస్ట్ చేసి.. బాలుడిని సురక్షితంగా తీసుకువస్తామని తెలిపారు. ఇలాంటి సంఘటనలు చాలా అరుదుగా జరుగుతున్నాయని స్పష్టం చేశారు. చిన్నారుల భద్రతపై సమాజం కొత్తగా ఆలోచించాల్సిన అవసరం ఉందని హెచ్చరిస్తున్నారు. పోక్సో చట్టం లింగానికి సంబంధం లేకుండా పనిచేస్తుందని, నేరం చేసిన వారెవరికైనా శిక్ష తప్పదని వివరించారు.

**పోక్సో చట్టం అంటే ఏమిటి..?**

పోక్సో అంటే Protection of Children from Sexual Offences Act, 2012. ఇది 18 సంవత్సరాల లోపు బాలురు, బాలికలను లైంగిక దాడుల నుంచి రక్షించేందుకు రూపొందించిన చట్టం. ఈ చట్టం ప్రకారం, మైనర్ పిల్లలతో శారీరక సంబంధాలు, లైంగిక వేధింపులు చేసిన వారెవరికైనా.. కఠిన శిక్షలు విధించబడుతుంది.

# కార్పొరేట్ విద్యలో మరో విద్యార్థి మృతి

తరువాయి భాగం

చనిపోయిన వారి కుటుంబాలకు లక్షలు పడేస్తే సరిపోతుందని యాజమాన్యాలు భావిస్తున్నాయి.మొన్నటి మొన్న మంచిర్యాలలో మిమ్స్ జూనియర్ కళాశాల భవనం నుంచి కిందపడి మృతిచెందిన విద్యార్థినీ సహస్ర ను మరవకముందే నేడు హనుమకొండ లోని ఎస్ ఆర్ కళాశాలలో విద్యార్థినీ మరణం కలకలం రేపింది.రాష్ట్రంలో ఇలాంటి ఘటనలు చాలా చోటు చేసుకుంటున్నాయి. నాణ్యమైన విద్యను అందిస్తామని నమ్మబలికి విద్యార్థుల జీవితాలతో ప్రైవేటు, కార్పోరేట్ కళాశాలలు చెలగాటం ఆడుతున్నాయి.

**కార్పోరేట్ కబంధ హస్తాల్లోకి విద్యా వ్యవస్థ**

రాష్ట్రంలో విద్యా వ్యాపారం విచ్చలవిడిగా సాగుతుంది.వీటిని ప్రభుత్వం ఏమాత్రం కట్టడి చేయకపోగా వారికే సంపూర్ణ సహకారాన్ని అందిస్తున్నాయి.ఐఐటి,జేఈఈ, నీట్ వంటి పేర్లతో స్పెషల్ కోర్సులు,స్పెషల్ క్లాసుల నిర్వహిస్తున్నామని ఏటా రంగురంగుల బ్రోచర్లతో,అన్ని ర్యాంకులు మావే అని చూపుతూ...అకాడమీల పేర్లతో విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తూ ఫీజులు దండుకుని తీరా కళాశాలలో విద్యార్థులు చేరిన తరువాత ర్యాంకుల రూపంలో చిత్రహింసలకు గురి చేసి మానసిక ఒత్తిళ్లకు గురి చేసి పరోక్షంగా ఆత్మహత్యలకు ప్రేరేపిస్తున్నారు.కొన్ని ప్రైవేటు విద్యా సంస్థల్లో విద్యార్థుల పైన తీవ్రమైన ఒత్తిడి నెలకొంది.చదువులో రాణించాలని చేసే ఒత్తిళ్లు తట్టుకోలేక





విద్యార్థులు లోలోపల మధనపడుతూ ఆ ప్రెషర్‌ను భరించలేక తాత్కాలిక సమస్యకు శాశ్వత పరిష్కారం వెతుక్కునే ప్రయత్నాలు చేస్తున్నారు.విద్యార్థి ఇష్టాఇష్టాలు తెలుసుకోకుండానే ఆ కోర్సు,ఈ కోర్సు..ఆ కాలేజీ, ఈ కాలేజీ అంటూ వారి కళాశాలలో పి.ఆర్.వోలను నియమించుకుని అడ్మిషన్స్ రూపంలో యాజమాన్యాలు విద్యార్థులను వారి తల్లిదండ్రులను గందరగోళానికి గురిచేసి ఇబ్బందుల్లోకి నెడుతున్నాయి.తీరా విద్యార్థులకు ఏ దారి లేకపోగా ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. నేడు హనుమకొండ లోని ఎస్ ఆర్ కళాశాలలో జరిగిన సంఘటనే ఇందుకు ఉదాహరణ.

**కార్పొరేట్ కళాశాల అయిన ఎస్.ఆర్ లో విద్యార్థినీ అనుమానాస్పద మృతి**

హనుమకొండ లోని నయీంనగర్‌లో గల కార్పోరేట్
ఎస్.ఆర్ కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతోన్న విద్యార్థినీ అనుమానాస్పదంగా మృతిచెందిన ఘటన నగరంలోని కలకలం రేపింది. మంచిర్యాల జిల్లాకు చెందిన మిట్టపల్లి శివాని (16) ఎం.పి.సి మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థినీ కళాశాల ప్రాంగణంలోనే మృతిచెందింది. కళాశాలలోనే మృతిచెందడంతో అనుమానాలు రేకెత్తిస్తోంది. మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం లేకుండా కళాశాల యాజమాన్యం నేరుగా వరంగల్ ఎంజిఎం ఆసుపత్రిలోని మార్చురీకి తరలించింది .ఈ చర్య పై శివాని కుటుంబ సభ్యులతో పాటు విద్యార్థులు సైతం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.ఘటనాస్థలంలో ఒక సూసైడ్ నోట్ లభించింది.అందులో కళాశాలలో చేర్చే ముందు ఒక్కసారి ఆలోచించాల్సిందిలే అంటూ శివాని తన మనోవేదనను వ్యక్తం చేసింది. ఈ లేఖతో మరింత అనుమానాలకు దారి తీసింది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని విచారణ ప్రారంభించారు. నిష్పక్షపాతంగా విచారణ జరిపించాలని విద్యార్థినీ తల్లిదండ్రులు డిమాండ్ చేశారు.

**ఎస్.ఆర్ కళాశాలల పై చర్యలు తీసుకోవాలి...విద్యార్థి సంఘాలు..**





ప్రైవేటు,కార్పోరేట్ కళాశాలల ఒత్తిళ్లకు విద్యార్థులు బలైపోతున్నారని ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని చాలా సార్లు విన్నవించినా రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని నేడు చిన్న వయసులోనే తీవ్రమైన ఒత్తిళ్లకులోనై విద్యార్థుల ఆత్మహత్యలు చేసుకోవడం బాధాకరమని విద్యార్థి సంఘాల నాయకులు అన్నారు.హనుమకొండ లోని ఎస్.ఆర్ జూనియర్ కళాశాలలో చదువుతున్న శివాని అనే ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న అమ్మాయి యాజమాన్యం వేధింపులు తట్టుకోలేక కళాశాల లోని ఫ్యాన్ కు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకోవడం జరిగిందని అన్నారు.వారి కుటుంబానికి న్యాయం చేయాలని,ఎస్ ఆర్ కళాశాలలను సీజ్ చేయాలని, కళాశాలల అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నట్లు తెలిపారు.

## ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు
# కర్రుకాల్చి వాతపెట్టాలి

తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో:

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో మళ్లీ గులాబీ జెండా ఎగరాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు అన్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొని మాట్లాడారు. బీఆర్ఎస్ పార్టీకి పట్టం కట్టిన గ్రేటర్ హైదరాబాద్ ప్రజలకు శిరస్సు వంచి నమస్కరిస్తున్నానన్నారు. బీఆర్ఎస్ పార్టీకి 50వేల మంది కార్యకర్తల సభ్యత్వం ఉన్న నియోజకవర్గం జూబ్లీహిల్స్ నియోజకవర్గమని.. ఉప ఎన్నికల్లో మళ్లీ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి గెలువాలన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక అనేక సంక్షేమ పథకాలు ఆగిపోయాయన్నారు. అబద్ధపు హామీలతో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని.. అధికారంలోకి వచ్చాక బస్తీల్లో ఉండే పేదల ఇండ్లు కూల్చుతున్నదని మండిపడ్డారు. సీఎం రేవంత్ కొడంగల్ నియోజకవర్గంలో ఎఫ్‌టీఎల్‌లో ఇల్లు కట్టుకున్నాడని.. హైదరాబాద్‌లో రేవంత్, ఆయన సోదరుడు తిరుపతి రెడ్డి ఇల్లు ఎఫ్‌టీఎల్‌లోనే ఉందని.. ఇలా చెప్పుకుంటే పోతే కాంగ్రెస్ నేతల ఇండ్లన్నీ బఫర్ జోన్, ఎఫ్‌టీఎల్‌లోనే ఉన్నాయన్నారు. కూట్లో రాయి తెయ్యలేని వాడు, ఎట్లో రాయి తీస్తా అని రేవంత్ మాట్లాడుతున్నాడని విమర్శించారు. మాగంటి గోపీనాథ్ చేసిన సేవలకు నివాళిగా, మరొక్కసారి జూబ్లీహిల్స్‌లో గులాబీ జెండా ఎగురవేద్దామని శ్రేణులకు పిలుపునిచ్చారు. 20 నెలల కాంగ్రెస్ అసమర్థ, అవినీతి ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. ఎన్నికల ముందు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, మల్లికార్జున్ ఖర్గే వంటి నేతలంతా వచ్చి తెలంగాణలోని అన్ని వర్గాల ప్రజలను మోసం చేశారన్నారు. రేవంత్ రెడ్డితో పాటు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ఇప్పుడు తెలంగాణ ప్రజలను మోసం చేస్తున్నారన్నారు.మోసగాళ్లకు, మోసగాళ్ల పార్టీ అయిన కాంగ్రెస్‌కు తెలంగాణ ప్రజలు గట్టి బుద్ధి చెప్పాలని, రానున్న ఉపఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి కర్రుకాల్చి వాత పెట్టాలన్నారు. 20 నెలల కాంగ్రెస్ మోసాన్ని చూసిన తర్వాత కూడా కాంగ్రెస్‌కు ఓటు వేస్తే, అన్ని సంక్షేమ పథకాలు ఆగిపోతాయన్నారు. ఇప్పటికే కాంగ్రెస్ గెలిచిన తర్వాత అనేక సంక్షేమ పథకాలు ఆగిపోయాయని.. మళ్లీ ఉపఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఒక్క ఓటు వేసినా, ఉన్న పథకాలన్నీ పోతాయన్నారు. కాంగ్రెస్ మోసానికి తెలంగాణ ప్రజలు అంగీకరించారని కాంగ్రెస్ పార్టీ, రేవంత్ రెడ్డి భావిస్తున్నారన్నారు. కాంగ్రెస్, బీజేపీల ఏకైక ఎజెండా తెలంగాణ రాష్ట్ర సమితిని ఓడించడమేనన్నారు. అందుకే ఈ రెండు పార్టీలు కలిసి తెలంగాణలో కుమ్మక్కు రాజకీయాలు చేస్తున్నారన్నారు. జూబ్లీ హిల్స్ నియోజకవర్గ బీఆర్ఎస్ శ్రేణులకు తాను ఒక్కటే చెబుతున్నానని.. గెలుస్తామన్న ధీమాతో నిర్లక్ష్యం వద్దని.. గెలుస్తామని ఇంట్లో ఉండకుండా ప్రతి ఒక్కరూ ఇంటింటికి తిరిగి బీఆర్ఎస్ గెలుపునకు కృషి చేయాలన్నారు. కొందరు ఎమ్మెల్యేలు పార్టీ మారినా మాగంటి గోపీనాథ్ బీఆర్ఎస్ పార్టీని వీడలేదని.. ఉపఎన్నిక గెలిచి మాగంటి గోపీనాథ్ అంకితమివ్వాలన్నారు.

# కాంట్రాక్టర్ల కోసమే కాళేశ్వరం

- రిపోర్ట్ అనంతరం దోషులకు కఠినంగా శిక్ష
- కాళేశ్వరం ప్రాజెక్టు పంపింగ్ ఫెయిల్
- ఎన్నికల్లో ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నాం
- కేసీఆర్‌పై మంత్రి వివేక్ ధ్వజం

తెలంగాణ చౌరస్తా, స్టేట్ బ్యూరో:

కాళేశ్వరం ప్రాజెక్టు రిపోర్ట్ వచ్చిన తర్వాత అవినీతికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షిస్తామని మెదక్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి వివేక్ వెంకటస్వామి హెచ్చరించారు. జస్టిస్ పీసీ ఘోష్ కాళేశ్వరం ప్రాజెక్టుపై రిపోర్ట్ ఇచ్చారని తెలిపారు. రాజశేఖర్ రెడ్డి హయాంలో తెలంగాణలో సాగునీటి కోసమని రూ.36 వేల కోట్లతో ప్రాణహిత చేవెళ్ల నిర్మించామని ఉద్ఘాటించారు. కేసీఆర్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కమీషన్‌ల కోసమే ఈ ప్రాజెక్టును కాళేశ్వరంలో కలిపారని ఆరోపించారు మంత్రి వివేక్ వెంకటస్వామి. కాళేశ్వరం ప్రాజెక్టులో లక్ష కోట్లు ఖర్చు చేశారని ఆక్షేపించారు. ఇప్పటివరకు కాళేశ్వరం నుంచి 70 టీఎంసీల పంపు చేసిన నీళ్లు కూడా వృథా అయ్యాయని విమర్శించారు. ఆదివారం గజ్వేల్ నియోజకవర్గంలో రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి వివేక్ వెంకటస్వామి పాల్గొని మాట్లాడారు. కేవలం కాంట్రాక్టర్లను ధనికులను చేయడానికి మాత్రమే కేసీఆర్ ప్రభుత్వం కాళేశ్వరం నిర్మించిందని ఆరోపించారు. మల్లన్న సాగర్‌కు ఎల్లంపల్లి నుంచి నీరు వస్తోందని.. ఎల్లంపల్లి ప్రాజెక్టును కాంగ్రెస్ హయాంలో నిర్మించామని గుర్తుచేశారు. గతంలో 15 లక్షల ఎకరాలకు ఎల్లంపల్లి నుంచి సాగు నీరు వచ్చేదని.. అలాంటి ఎల్లంపల్లి ప్రాజెక్టును కాళేశ్వరంలో కలిపారని ధ్వజమెత్తారు. కాళేశ్వరం ప్రాజెక్టు పంపింగ్ ఫెయిల్ అయిందని మండిపడ్డారు. వంద మీటర్లు పంపింగ్ చేయాలంటే రూ.4 వేల కోట్లు అవసరని వెల్లడించారు మంత్రి వివేక్ వెంకట స్వామి.
'ఒక్క రేషన్ కార్డు ద్వారా ఎంతమంది ఏ ఏ స్కీములు తీసుకున్నారో తెలుస్తుంది. కాంగ్రెస్ మేనిఫెస్టోలో ఇందిరమ్మ ఇండ్లు, కొత్త రేషన్ కార్డులు ఇస్తామని ప్రకటించాం. కాంగ్రెస్‌ను ప్రజలు ఓట్లు వేసి గెలిపించారు. 10 వేల ఇళ్లు సిద్దిపేట జిల్లాకు అమలు అయ్యాయి. గజ్వేల్ నియోజకవర్గానికి 3500 ఇండ్లు ఇస్తాం. మా ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన మాట నిలబెట్టుకుంది. సిద్దిపేట జిల్లాలో 2 లక్షల మందికి 200 యూనిట్‌ల విద్యుత్ ఫ్రీగా ఇస్తున్నాం, రూ. 12 వేల కోట్లతో సన్నబియ్యం ఇస్తున్నాం. రాజీవ్ ఆరోగ్య శ్రీని రూ. 10 లక్షల వరకు పెంచాం. సుమారు రూ.9 వేల కోట్లతో సీఎం రిలీఫ్ ఫండ్ ఇస్తాం. సిద్దిపేట జిల్లాలో రూ.36 కోట్లతో స్కూళ్ల మరమ్మతు చేశాం. సిద్దిపేట జిల్లాలో 3967 నూతన రేషన్ కార్డులు అందజేస్తున్నాం. 88 వేల మంది రైతులకు సుమారు రూ.100 కోట్లు రైతు భరోసా, మహిళలకు వడ్డీ లేని రుణాలు ఇచ్చాం. సుమారు 41 వేల మందికి గ్యాస్ స్కీమ్ అమలు చేశాం' అని మంత్రి వివేక్ వెంకట స్వామి పేర్కొన్నారు.

# డ్రగ్స్, గంజాయికి యువకులు దూరంగా ఉండాలి

- గ్రామీణ ప్రాంతాల్లో బెల్ట్ షాపులను ఎత్తి వెయ్యాలి.
- పెడదారిన వెళ్తున్న యువత భవిష్యత్తును కాపాడాలి
- నారాయణపేట సిఐ శివశంకర్,
- పివైఎల్ రాష్ట్ర కార్యదర్శి పెద్దింటి రామకృష్ణ.




**నారాయణపేట, తెలంగాణ చౌరస్తా:**

గ్రామీణ పట్టణ ప్రాంతాల్లో డ్రగ్స్ గంజాయి మద్యానికి బానిస అవుతున్న యువత భవిష్యత్తును కాపాడాలని ప్రగతిశీల యువజన సంఘం ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లా కేంద్రంలోని టౌన్ పోలీస్ స్టేషన్ లో సర్కిల్ ఇన్స్పెక్టర్) శివశంకర్ చే పోస్టర్ ఆవిష్కరణ చేయడం జరిగింది.ఈ సందర్భంగా CI శివ శంకర్, పివైఎల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పెద్దింటి రామకృష్ణ మాట్లాడుతూ పట్టణ ప్రాంతాలతో పాటు గ్రామీణ ప్రాంతాలలో యువకులను డ్రగ్స్ ,గంజాయి మద్యం విక్రయాల మూలంగా వాటికి బానిసలుగా మారిన విద్యార్థులు,యువకులు భవిష్యత్ పై ధ్యాస లేకుండ , జీవితం మీద బాధ్యత సమాజం పట్ల ఏమాత్రం గౌరవం లేకుండా ప్రవర్తన ఉన్నది. వాటిని కట్టడి చెయ్యాల్సిన పాలకులు,అధికారులు విచ్చలవిడిగా అనుమతులు ఇవ్వడం మూలంగా దేశ భవిష్యత్ ను కాపాడాల్సిన యువతరం నేడు అంధకారంలోకి నెట్టబడ్డారు.కుటుంబంపై వారి జీవితాలపై ఏమాత్రం ధ్యాస లేకుండా ప్రజలను భయభ్రాంతులకు గురి చేయడం వంటి అనేక సంఘటనలు ప్రతిరోజూ దర్శనం ఇస్తున్నాయి.అందుకని గ్రామీణ,పట్టణ ప్రాంతాల్లోని యువతి యువకులు డ్రగ్స్ గంజాయి మద్యం లాంటి చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని కోరారు.వాటి నివారణ కొరకు విద్యార్థి యువకులు పెద్ద ఎత్తున పోరాటం చేయాలని యువత భవిష్యత్తును కాపాడడం కోసం రాష్ట్ర జిల్లా వ్యాప్తంగా యుకులను సమాజం పట్ల గౌరవ మర్యాదలు ఉండేటట్లు చైతన్య కార్యక్రమాలు చేపట్టాలని పిలుపిచ్చారు.వాటి నివారణకై ప్రభుత్వాలు,అధికారులు పర్యవేక్షణ చేయాలని కఠిన చట్టాలు అమలుచేసి వాటిని నియంత్రించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో టౌన్ SI గాయత్రి, ప్రగతిశీల యువజన సంఘం (పివైఎల్) జిల్లా అధ్యక్షుడు ప్రతాప్, పివైఎల్ ప్రధాన కార్యదర్శి సిద్ధు, జిల్లా ఉపాధ్యక్షులు సలీం,అంజి, మల్లేష్ సహాయ కార్యదర్శి రాము, మధు, తిరుమలేశ్,కోశాధికారి గణేష్,జిల్లా నాయకులు కృష్ణ,యల్లప్ప,బాల్ రాజ్,శివ,గణేష్ తదితరులు పాల్గొన్నారు.

# చేనేత కార్మికులకు న్యాయం చేయాలి

- సొసైటీలో సభ్యత్వం ఇవ్వాలి.
- ఇండ్లు రిజిస్ట్రేషన్ చేయాలి
- చేనేత కార్మిక సంఘం (టియుసిఐ)అనుబంధం డిమాండ్



**నారాయణపేట,తెలంగాణ చౌరస్తా:**

నారాయణపేట జిల్లా కేంద్రంలో గాంధీనగర్ తాయమ్మ గుడిలో చేనేత కార్మికుల జనరల్ బాడీ మీటింగ్ నిర్వహించారు.ఈ కార్యక్రమానికి సీపీఐ (ఎంఎల్)మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి కె.కాశీనాథ్,టి యు సి ఐ జిల్లా ఉపాధ్యక్షులు బి. నర్సింహ,చేనేత కార్మిక సంఘం టియుసిఐ జిల్లా నాయకులు కెంచె నారాయణ లు మాట్లాడుతూ నారాయణపేట పట్టణం కేంద్రంలో చేనేత సహకార సంఘం 1951సం"రంలో ఏర్పడింది.అందులో దాదాపు 4265 మంది కార్మికులు ఉన్నారు. గాంధీ నగర్ కాలనీకి చెందిన చేనేత కార్మిక సొసైటీ తరపున వంద మందికి ఇండ్లు నిర్మించి ఇచ్చినారు.చేనేత పనిముట్లు ఇచ్చి కాలనీ నిర్మించారు.కార్మికుల దగ్గర నెలకు 5 రూపాయల చొప్పున ఒక్కొక్కరి దగ్గర దాదాపు 2475/ రూపాయలు వసూలు చేశారు.సొసైటీ, ప్రభుత్వం నిర్ణయించిన ధర మొత్తం గత 35 సంవత్సరాల కిందటనే సొసైటీకి, ప్రభుత్వానికి లబ్ధిదారులు చెల్లించారు. అయినా నేటికి ప్రభుత్వం సొసైటీ ఇంటి యజమానులకు రిజిస్ట్రేషన్ చేయించకుండా ఇబ్బంది పెడుతున్నారు.ప్రభుత్వం సొసైటీ ఇండ్ల పట్టాలను వెంటనే ఇప్పించాలని సిపిఐఎంఎల్ మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి కాశీనాథ్ డిమాండ్ చేశారు.చేనేత పైన ఆధారపడి జీవిస్తున్న కార్మికుల పేర్లను సొసైటీ నుండి తొలగించడం అన్యాయమన్నారు.ఇప్పుడున్న సహకార సంఘంలో 72 సభ్యులు మాత్రమే ఉన్నారు.నారాయణపేట పట్టణంలో వందలాది మంది కార్మికులు చేనేత వృత్తిని నమ్ముకొని మగ్గాలు నేస్తున్న కార్మికులకు జౌళి శాఖ అధికారి ఎ.డి వెంటనే సహకార సంఘం సభ్యత్వాన్ని ఇవ్వాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో చేనేత కార్మికులను కూడగట్టుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ నరసింహులు, నాగేందర్,కమలాపూర్ మహేష్,నందు,అంబదాస్,వెంకట్రావు,ప్రవీణ్ శంకర్,నాగేందర్,మహాదేవ్,నర్సిరెడ్డి,బాలాజీ,రామకృష్ణ,నరేష్,రమేష్,అమర్,అనిల్,వరప్రసాద్,శ్రీకాంత్,అనంతమ్మ, లక్ష్మి ,సచిన్, నవీన్, నిఖిల్, నరేష్, అభి, జై, రాకేష్, శ్రీధర్, గణేష్, జైపాల్, తదితరులు పాల్గొన్నారు.




# సర్కార్ రైతులకు ఎరువుల కొరత తీర్చాలి

- బిఎస్పీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జుట్ల నరేందర్

**మక్తల్, తెలంగాణ చౌరస్తా:**

బహుజన సమాజ్ పార్టీ కార్యాలయంలో కెవి నరసింహ ఆధ్వర్యంలో మక్తల్ అసెంబ్లీ పరిధిలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య వక్తగా బహుజన సమాజ్ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జుట్ల నరేందర్ హాజరయ్యారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో రైతులకు సరిపడా ఎరువులు దొరకడం లేదు.రైతులు పడుతున్న ఇబ్బందులు రేవంత్ రెడ్డికి కనపడటం లేదా అని అన్నారు అలాగే వెంటనే రైతులకు సరిపడా ఎరువులు అందించాలి.వెంటనే యూరియాను అందించి రైతుల సమస్యలు పరిష్కరించాలని లేని యడల బహుజన సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో రైతులకు అండగా ఆందోళన కార్యక్రమలు చేపడతామని కేవీ నరసింహ అన్నారు.ఈ కార్యక్రమంలో బహుజన సమాజ్ పార్టీ మక్తల్ అసెంబ్లీ అధ్యక్షులు కె వి నరసింహ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జుట్ల నరేందర్, జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి చంద్రశేఖర్ , మక్తల్ అసెంబ్లీ ఇంచార్జి పాలెం వెంకటయ్య , ఉపాధ్యాక్షులు పరుశురాం,కోశాధికారి నేరటి మల్లికార్జున్ , మక్తల్ పట్టణ అధ్యక్షులు లక్ష్మణ్ పాల్గొన్నారు




# నాచారంలో అనాహ డెర్మా & ఆర్థో క్లినిక్ ప్రారంభం

**నాచారం,తెలంగాణ చౌరస్తా:**

చర్మ సంబంధిత సమస్యల కొరకు అలాగే ఆర్తో సంబంధిత సమస్యల కొరకు నాచారం ప్రధాన రహదారిపై అనాహా డేర్మ మరియు ఆర్తో క్లినిక్ ను ఉప్పల్ శాసనసభ్యులు బండారి లక్ష్మా రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. హాస్పిటల్ ఏర్పాటు డ్యూయల్ బోర్డ్ సర్టిఫైడ్ డెర్మటాలజిస్ట్ డాక్టర్ సుష్మ సుకృతి మరియు డాక్టర్ డి. ప్రదీప్ వర్మ లకు ఎమ్మెల్యే శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాచారంలో ఈ క్లినిక్ ఏర్పాటు చేయడం చాలా సంతోషదాయకమన్నారు. పేద పేషెంట్లు వస్తే వారికి వీలైనంత తక్కువ ఖర్చులో వైద్యం అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సామల రఘు ప్రసాద్ ,సామల రంగ, మరియు శ్రీలత, బిఆర్ఎస్ నాయకులు సాయిజెన్ శేఖర్, కాలేరు జై నవీన్, కట్ట బుచ్చన్న గౌడ్, విటల్ యాదవ్, రామచందర్, సంపత్ యాదవ్, యూసుఫ్, మక్బూల్, సుగుణాకర్ రావు, వాసు, నరసింహ, శివ, చంద్రశేఖర్, ఈశ్వర్, యాసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు




# భూ నిర్వాసితులకు న్యాయం చేయాలి

- ప్రభుత్వం తక్షణమే న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలి
- సీపీఐ (ఎంఎల్)మాస్ లైన్ డిమాండ్

**నారాయణపేట, తెలంగాణ చౌరస్తా:**

భూ నిర్వాసితులకు న్యాయం చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ జిల్లా కార్యదర్శి బి.రాము అన్నారు. ఆదివారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని భగత్ సింగ్ భవన్‌లో సీపీఐ (ఎంఎల్) మాస్ లైన్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం భూములను ప్రాజెక్టుల కోసం తీసుకుంటే,ప్రస్తుతం ఉన్న మార్కెట్ రేటుకి తగిన నష్టపరిహారం ఇవ్వాలి. ఖమ్మం, భువనగిరి, సంగారెడ్డి జిల్లాల్లో 5060 లక్షల పరిహారం ఇస్తున్న ప్రభుత్వం,ముఖ్యమంత్రి సొంత నియోజకవర్గంలో మాత్రం కేవలం 14 లక్షల పరిహారం ప్రకటించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. భూమి అమ్మకానికి రైతులు తమ ఇష్టంతో ముందుకు రావడం లేదని,ప్రభుత్వ ప్రాజెక్టుల పేరుతో భూములు తీసుకుంటే సరైన పరిహారం ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదన్నారు.రైతులకు కన్నీళ్లు మిగలకుండా,భూమి ఇచ్చినందుకు గౌరవంగా, ఆర్థిక భద్రత కలిగించే రీతిలో పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ డివిజన్ కార్యదర్శి కె. కాశీనాథ్, భగవంతు, యాదగిరి, రామకృష్ణ, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ మండల కార్యదర్శి నర్సింహులు,నాయకులు జి. వెంకట్ రాములు,ఏ. రాములు తదితరులు పాల్గొన్నారు.



# శ్రీవిద్యా భారతి హై స్కూల్ పూర్వ విద్యార్థుల రజతోత్సవ సంబరాలు

**భీమదేవరపల్లి తెలంగాణ చౌరస్తా :**

మండలంలోని ముల్కనూర్ శ్రీ విద్యా భారతి హై స్కూల్‌లో 25 సంవత్సరాల క్రితం (20002001 ) విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు తమ పాఠశాల రజతోత్సవ వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనం భావోద్వేగాల పరంపరగా సాగింది. సుమారు 50 మందికి పైగా పూర్వ విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉదయం 10 గంటల నుంచి పూర్వ విద్యార్థులు ఒకరినొకరు పేరుతో పిలుచుకుంటూ, పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆలింగనం చేసుకున్నారు. పాత స్నేహితులను ఇన్నేళ్ల తర్వాత కలుసుకోవడం, వారి బాల్యం ఆనాటి అనుభవాలను పంచుకోవడం అద్భుతమైన అనుభూతిని కలిగించిందని పలువురు విద్యార్థులు పేర్కొన్నారు. తాము చదువుకున్న రోజులనాటి ఉపాధ్యాయులను సత్కరించుకోవడం ఈ వేడుకలకే ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పలువురు విద్యార్థులు మాట్లాడుతూ, పాఠశాల తమకు కేవలం విద్యను మాత్రమే కాకుండా, క్రమశిక్షణ, నైతిక విలువలను కూడా నేర్పిందని గుర్తు చేసుకున్నారు. ఈ రోజు తాము ఉన్నత స్థానాల్లో ఉండటానికి తమ గురువుల బోధనలే కారణమని కన్నీటి పర్యంతమయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల పూర్వ ప్రిన్సిపాల్ బేరే యాదగిరి మాట్లాడుతూ, తమ విద్యార్థులు జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకున్నందుకు గర్వంగా ఉందని, ఇలాంటి పూర్వ విద్యార్థుల సమ్మేళనాలు మరిన్ని జరగాలని ఆకాంక్షించారు. సాయంత్రం అందరూ కలిసి భోజనం చేసి, ఫోటోలు తీసుకున్నారు. ఈ కార్యక్రమం పూర్వ విద్యార్థుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని, ఈ జ్ఞాపకాలను ఎప్పటికీ మర్చిపోలేమని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అల్లం నరసయ్య, శ్రీనివాస్ రెడ్డి, దస్తరి ఉమా మహేశ్వర్, చెప్యాల గోపాల్ రెడ్డి, చంద్రయ్య, శ్రీలత, విజయ నిర్మల, పున్నం రవీందర్, చిదురాల పాపయ్య, గుడికందుల విజయ్ పాల్గొన్నారు.



# గిరిజన తండాలలో నేరాలపై అవగాహన సదస్సు

**నరసింహుల పేట, తెలంగాణ చౌరస్తా;**

మండలంలోని గోపతండ గ్రామపంచాయతీ ప్రధాన కూడలిలో మండల రక్షణ శాఖ అధికారి ఎం సురేష్ గిరిజన ప్రజలకు శాంతి భద్రతలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఇందులో భాగంగా ప్రధానంగా గిరిజన గ్రామాలలో బాల్యవివాహాలను అరికట్టడంతోపాటు యువకులు మద్యపానం ధూమపానానికి దూరంగా ఉండాలని కోరారు. నేటి సమాజానికి యువకులే ఆదర్శంగా నిలుస్తూ గ్రామ పెద్దలు తమ స్వలాభం కోసం కుల పంచాయతీలను రెచ్చగొట్టవద్దని యువకులు చట్టాన్ని తమ పరిధిలో తీసుకోకుండా ప్రతి విషయాన్ని స్థానిక పోలీస్ అధికారులకు తెలియజేయాలని సూచించారు. యువకులు టెక్నాలజీ తో పాటు న్యాయ చట్టాలలో పలు మార్పులను నూతన చట్టాలను యువకులు గ్రామ పెద్దలకు, ప్రతి యువకులకు తమకు తాము చట్టాలపై ప్రతి విషయాలను స్పష్టంగా తెలుసుకొని గ్రామాలలో నేరాలను అరికట్టాలని సూచించారు ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై ఎం సురేష్ పోలీసు సిబ్బందులు తో పాటు గ్రామ పెద్దలు గోపా, రాజేందర్ నాయక్, వంశీ నాయక్, పాప నాయక్, మురళి నాయక్, మోహన్, స్థానిక ప్రజలు మహిళలు పాల్గొన్నారు.



## వీరశైవ లింగాయత్ పాదయాత్రలో కాట శ్రీనివాస్ గౌడ్

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా:**

వీరశైవ లింగాయత్ సమాజం అధ్వర్యంలోపటాన్‌చెరు పట్టణంలోని ఉమామహేశ్వర దేవాలయం నుండి బొంతపల్లి శ్రీ వీరభద్ర స్వామి ఆలయం వరకు నిర్వహించిన 18వ మహా పాదయాత్రలో కాంగ్రెస్ పార్టీ పటాన్ చెరు నియోజకవర్గ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు. లోక కల్యాణం కోసం 18 ఏండ్లుగా పాదయాత్ర నిర్వహించడం గొప్ప విషయం అని చెప్పారు. భక్తి, ఆధ్యాత్మికత మరియు సమాజ సేవకు మార్గదర్శకంగా నిలిచే ఈ పాదయాత్రలో భాగస్వామ్యం కావడం ఆనందంగా ఉందని కాటా శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో బీరంగూడ గుట్ట ఆలయం చైర్మన్ సుధాకర్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్ గౌడ్, శశిధర్ రెడ్డి, హబీబ్ జానీ, తదితరులు పాల్గొన్నారు.

ఓబీసీ మహాసభ పోస్టర్ ఆవిష్కరించిన 'కాట'..జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 7న నిర్వహించనున్న అఖిల భారత జాతీయ ఓబీసీ 10వ మహాసభ పోస్టర్ ను కాంగ్రెస్ పార్టీ పటాన్ చెరు నియోజకవర్గ ఇంచార్జ్ కాట శ్రీనివాస్ గౌడ్ ఆవిష్కరించారు. గోవాలోని శ్యాంప్రసాద్ ముఖర్జీ ఇండోర్ స్టేడియంలో నిర్వహించే ఈ మహాసభకు సంబంధించిన పోస్టర్ ను ఆయన ఆదివారం పటాన్ చెరులో ఆవిష్కరించారు. కార్యక్రమంలో బీరంగూడ గుట్ట ఆలయం చైర్మన్ సుధాకర్ యాదవ్, కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్ రెడ్డి, సుధాకర్ గౌడ్, శశిధర్ రెడ్డి, హబీబ్ జానీ, బీసీ సంక్షేమ సంఘం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.





## విశ్వశాంతి కోసం వీరశైవ లింగాయత్ సమాజం పాదయాత్ర

- పటాన్ చెరు నుంచి బొంతపల్లి వరకు 18వ పాదయాత్ర
- ప్రారంభించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి
- పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, నాయకులు

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా:**

విశ్వశాంతి కోసం వీరశైవ సమాజం ఆధ్వర్యంలో పటాన్ చెరు నుండి బొంతపల్లి వీరభద్ర స్వామి దేవస్థానం వరకు పాదయాత్ర నిర్వహించారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ సారి కూడా 18వ పాదయాత్ర చేపట్టారు. పటాన్ చెరు పట్టణంలోని ఉమామహేశ్వర ఆలయంలో ఆదివారం పూజలు నిర్వహించారు. ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి జెండా ఊపి పాదయాత్రను ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి వివిధ పార్టీల నాయకులు, వీరశైవ లింగయ్య సమాజం ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ 12వ శతాబ్దంలో అభ్యుదయ సమాజం కోసం కృషి చేసిన గొప్ప సంఘసంస్కర్త మహాత్మా బసవేశ్వరుడి స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేపట్టడం సంతోషకరమన్నారు. 18 సంవత్సరాలుగా ఏకధాటిగా పాదయాత్ర చేపట్టడం అభినందనీయమన్నారు. నియోజకవర్గంలోని వీరశైవుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు పుష్ప నగేష్, మెట్టు కుమార్ యాదవ్, బీఆర్ఎస్ పటాన్ చెరు నియోజకవర్గ కోఆర్డినేటర్ వెన్నవరం ఆదర్శ్ రెడ్డి, సమాజం ప్రతినిధులు అశోక్, సుధాకర్, బస్వరాజ్, నాయకులు నర్ర బిక్షపతి, మాదిరి ప్రిథ్వీరాజ్, భారీ సంఖ్యలో పాల్గొన్నారు.







## బసవేశ్వరుడీ బోధనలు స్ఫూర్తిదాయకం

- వీరశైవుల అభివృద్ధికి సంపూర్ణ సహకారం
- విశ్వశాంతి కోసం18వ పాదయాత్ర అభినందనీయం
- కాంగ్రెస్ నేత నీలం మధు ముదిరాజ్

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా:**

మహాత్మ బసవేశ్వరుడి బోధనలు స్ఫూర్తిదాయకమని ఆ మహాత్ముడు చూపిన సన్మార్గంలో వీరశైవులు పయనిస్తూ లోక కళ్యాణం కోసం చేస్తున్న కృషి ప్రశంసనీయమని మెదక్ పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ కంటెస్టెడ్ క్యాండిడేట్ నీలం మధు ముదిరాజ్ అన్నారు. ఆదివారం పటాన్ చెరు వీరశైవ లింగాయత్ సమాజ్ ఆధ్వర్యంలో విశ్వశాంతి కోసం పటాన్ చెరు ఉమామహేశ్వర దేవాలయం నుంచి బొంతపల్లి వీరభద్రస్వామి దేవాలయానికి నిర్వహిస్తున్న పాదయాత్రకు ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా నీలం మధు మాట్లాడుతూ విశ్వశాంతికి వీరశైవ లింగాయత్ లు గత 18 సంవత్సరాలుగా పాదయాత్రను చేపట్టడం అభినందనీయమన్నారు. సమాజంలో కుల, వర్ణ, లింగ వివక్షతను వ్యతిరేకించి సమ సమాజం కోసం పోరాడిన అభ్యుదయ వాది మహాత్మా బసవేశ్వరునీ అడుగుజాడలలో నడుస్తూ ఆయన బోధించిన ప్రవచనాలను పాటిస్తూ వీరశైవ లింగాయత్ లు సమ సమాజ స్థాపనకు కృషి చేస్తున్నారని కొనియాడారు. సమాజ హితం కోసం పాటుపడే వీర శైవ లింగాయత్ లకు సంపూర్ణ సహకారం అందిస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ వీరశైవ లింగాయత్ ల అభివృద్ధి కోసం పనిచేస్తుందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయంలోనే లింగాయత్ లను ఓసీ నుంచి బీసీ లకు మార్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. భవిష్యత్తులో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో లింగాయత్ ల అభ్యున్నతికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో లింగాయత్ సమాజ్ నాయకులు, ఐఎన్టీయూసీ జిల్లా అధ్యక్షుడు నరసింహారెడ్డి, నాయకులు జలిగారి ఎట్టయ్య, పట్లోళ్ల ఆదిత్య రెడ్డి, రవి, దేవరాజ్, సాయి, అశోక్, ప్రవీణ్, అనిల్, భక్తులు తదితరులు పాల్గొన్నారు.




## బాంబే కాలనీలో ఘనంగా బోనాలు

- మాజీ ప్రోటెం ఛైర్మెన్ భూపాల్ రెడ్డి పూజలు
- పాల్గొన్న బీఆర్ఎస్ పార్టీ నాయకులు

**పటాన్ చెరు, తెలంగాణ చౌరస్తా:**

పటాన్ చెరు నియోజకవర్గం భారతి నగర్ డివిజన్ పరిధిలోని బొంబాయి కాలనీలో శ్రావణ మాసం సందర్భంగా పోచమ్మ మరియు ఎల్లమ్మ బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. శాసన సభ మాజీ ప్రోటెం చైర్మన్ భూపాల్ రెడ్డి, పటాన్ చెరు నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ కోఆర్డినేటర్ ఆదర్శ్ రెడ్డి, భారతి నగర్ డివిజన్ కార్పొరేటర్ సింధు ఆదర్శ్ రెడ్డి, రామచంద్రపురం మాజీ కార్పొరేటర్ తొంట అంజయ్య, పటాన్ చెరు మాజీ జడ్పీటీసీ శ్రీకాంత్ గౌడ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు నరసింహ, విజయ్ గౌడ్, సతీష్, సామ్యూల్, వినయ్ కుమార్, శ్రీకాంత్, నరేష్ తదితరులు బోనాల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఉత్సవాలకు స్థానికులు పెద్దఎత్తున హాజరై భక్తిశ్రద్ధలతో దేవతలకు బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జగన్నాథ రెడ్డి, విష్ణు వర్ధన్ రెడ్డి, మహేందర్ రెడ్డి, వెంకట్ రెడ్డి, మహేష్, జానీ, బిఆర్ఎస్ మహిళా సర్కిల్ ప్రెసిడెంట్ రాణి యాదవ్, శ్రీలత పాల్గొన్నారు.





## ప్రభుత్వ విద్యా ప్రతీ ఒక్కరికి అందాలి

- ఈ నెల 5న జరిగే ధర్నాను విజయవంతం చేయండి
- టిఎస్ యూటీఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ. వెంకటేష్

**కరీంనగర్, తెలంగాణ చౌరస్తా:**

ప్రభుత్వ విద్యా ప్రతీ ఒక్కరికి అందాలని ఈ నెల 5న జరిగే ధర్నాను విజయవంతం చేయాలని టిఎస్ యూటీఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ. వెంకటేష్ కోరారు.జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లా కమిటీ సమావేశంలో వారు మాట్లాడుతూ....ప్రతీ విద్యార్థికి ప్రభుత్వ విద్య అందాలన్నారు. నూతనంగా తెరిచినా పాఠశాలలకు ఉపాధ్యాయులను కేటాయించి మౌలిక సౌకర్యాలు కల్పించాలన్నారు.ఉపాధ్యాయులకు ప్రారంభించిన ఎఫ్ ఆర్ ఏస్ ను స్వాగతిస్తున్నామన్నారు. పెండింగ్ లో ఉన్న కరువుభత్యాన్ని మంజూరు చేయాలన్నారు.విద్య, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కరం కోసం యూఎస్పీసి ఆధ్వర్యంలో ఈ నెల ఐదున జరిగే జిల్లా స్థాయిలో ధర్నాను ఉపాధ్యాయులు విజయవంతం చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు తిరుకోవెల శ్యామ్ సుందర్,అంబటి భూమేశ్వర్, కార్యదర్శి గడ్డలు శ్రీధర్, ఆడిట్ కమిటీ సభ్యులు సిరిపురం శ్రీనివాస్, బల్ల సత్యనారాయణ, నాగరాజు, శ్యామకూర శ్రీనివాస్, నిరంజన్, చిరంజీవి,యాదగిరి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



## జాబ్ క్యాలెండర్ విడుదలకై నిరుద్యోగుల నిరసన

**సికింద్రాబాద్, తెలంగాణ చౌరస్తా:**

జాబ్ క్యాలెండర్ ప్రకటించి సంవత్సరం దాటినా నేటికి ఒక్క ఉద్యోగ నోటిఫికేషన్ ఇవ్వలేదని ప్రభుత్వ తీరుకు నిరసనగా నిరసనను ఆదివారం ఓయూ లైబ్రరీ ఎదుట నిరసన వ్యక్తం చేశారు.జాబ్ క్యాలెండర్ బోగస్ బోగస్ అని నిరుద్యోగులు నినాదాలు ఇచ్చారు. ప్రభుత్వం వెంటనే జాబ్ నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలని కోరారు.

2024 ఆగస్టు 2న అసెంబ్లీలో ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క జాబ్ క్యాలెండర్‌ను ప్రకటించి, అనేక నోటిఫికేషన్లు ఇస్తామని హామీలు ఇచ్చి, ఒక్క నోటిఫికేషన్ ఇచ్చి, అది కూడా పూర్తి చేయకుండానే జాబ్ క్యాలెండర్‌ను కాస్తా జాబ్ లెస్ క్యాలెండర్ గా మార్చి తెలంగాణ నిరుద్యోగులను దగా చేసిందని విద్యార్థి నేత చటారి.దశరథ్ అన్నారు.ఏడాదికి రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, ప్రతీ ఏటా జాబ్ క్యాలెండర్‌ను ప్రకటిస్తామంటూ నిరుద్యోగులను మభ్యపెట్టిన కాంగ్రెస్ ప్రభుత్వానికి, రాబోయే రోజుల్లో నిరుద్యోగులం అందరం కలిసి స్థానిక సంస్థలు ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని బొంద పెడతాం అని హెచ్చరించారు.





# ప్రజలందరికీ నాణ్యమైన సన్న బియ్యం సరఫరా

– నూతన రేషన్ కార్డులను పంపిణీ చేసిన మంత్రి ఉత్తమ్



**కరీంనగర్, తెలంగాణ చౌరస్తా:** 3 కోట్ల 17 లక్షల మంది ప్రజలకు నెలకు 6 కిలోల నాణ్యమైన సన్న బియ్యం సరఫరా చేస్తున్నామని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి వర్యులు ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. రామడుగు మండలంలో రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి,ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఇంచార్జి మంత్రి వర్యులు తుమ్మల నాగేశ్వర రావు, బీసి రవాణా శాఖ మంత్రి వర్యులు పొన్నం ప్రభాకర్,చోప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం,కరీంనగర్ జిల్లా కలెక్టర్ పామెలా సత్పతి ఇతర రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి పేద కుటుంబాలకు నూతన రేషన్ కార్డులను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ...నారాయణ పూర్ రిజర్వాయర్ ప్రాజెక్టు నిర్మాణానికి భూ సేకరణ చేసేందుకు అవసరమైన నిధులను ఆగస్టు నెలలో మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు.గోదావరి నది జిల్లాలో చొప్పదండి నియోజకవర్గానికి న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.తెలంగాణ నీటి హక్కులను హరిస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం బనకచర్ల ప్రాజెక్టు నిర్మిస్తుందని ఏపి మంత్రి నారా లోకేష్ ప్రకటించారని,తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి తాను బనకచర్ల ప్రాజెక్టు పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని అన్నారు. మిగులు జలాల పై తెలంగాణ రాష్ట్రానికి ఉన్న వాటా ముందుగా తేలాలని అన్నారు.బనకచర్ల ప్రాజెక్టు పై గోదావరి వాటర్ మేనేజ్మెంట్ బోర్డు,పోలవరం ప్రాజెక్టు అథారిటీ,సి.డబ్ల్యూ.సి వరకు ఫిర్యాదు చేసి ఆ ప్రాజెక్టును అడ్డుకున్నామని మంత్రి తెలిపారు.ప్రభుత్వ అభ్యంతరాల మేరకు ఆ ప్రతిపాదనను తిరస్కరించడం జరిగిందన్నారు.కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జరిగిన ముఖ్యమంత్రుల సమావేశంలో గోదావరి జలాల ట్రిబ్యునల్, ఏపీ పునర్విభజన చట్టం కు వ్యతిరేకంగా బనకచర్ల ప్రాజెక్టు నిర్మించాలని ఏపీ చూస్తుందని, దీనిని అన్ని వేదికలలో, న్యాయపరంగా తెలంగాణ ప్రభుత్వం వ్యతిరేకిస్తుందన్నారు. దేశంలో 28 రాష్ట్రాలలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో 84 శాతం జనాభా కు ఉచితంగా సన్న బియ్యం రేషన్ ద్వారా సరఫరా చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ మాత్రమేనని అన్నారు.అర్హులైన పేదలందరికీ రేషన్ కార్డులు అందించేలా ప్రజా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని అన్నారు. కరీంనగర్ జిల్లాలోని చొప్పదండి నియోజకవర్గం పరిధిలో 3 మండలాల్లో అదనంగా 5 వేల కుటుంబాలకు నూతన రేషన్ కార్డులు మంజూరు చేసి అదనంగా 12,133 మంది పేదలకు రేషన్ అందిస్తున్నామన్నారు.గత ప్రభుత్వం 10 వేల కోట్ల
ఖర్చు పెట్టి రేషన్ ద్వారా 2.82 కోట్ల దోడ్డు బియ్యం సరఫరా చేసేదని, ఆ బియ్యం 80 శాతం అక్రమాలకు, రీసైక్లింగ్ కు ఉపయోగపడేదన్నారు.ప్రస్తుతం దేశంలో ఎక్కడా లేని విధంగా 3 కోట్ల 17 లక్షల మంది నిరుపేదలకు 13 వేల కోట్ల ఖర్చు చేసి నెలకు 6 కిలోల నాణ్యమైన సన్న బియ్యం సరఫరా చేస్తున్నామన్నారు.ప్రస్తుతం అర్హులైన అందరికీ రేషన్ కార్డుల పంపిణీ చేస్తున్నామన్నారు.8 లక్షల 64 వేల నూతన రేషన్ కార్డులు రాష్ట్ర వ్యాప్తంగా జారీ చేశామని , ప్రస్తుతం 98 లక్షల 58 వేల రేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు.
జిల్లా కలెక్టర్ పామెలా సత్పతి మాట్లాడుతూ.... పారదర్శకంగా రేషన్ కార్డుల పంపిణీ చేస్తున్నామని అన్నారు.నూతన రేషన్ కార్డుల జారీ,ఉన్న కార్డులలో కొత్త పేర్ల నమోదు,మార్పులు చెర్పులు కలిపి మొత్తం 78 వేల ప్రజలకు కరీంనగర్ జిల్లాలో అదనంగా రేషన్ అందుతుందని అన్నారు.

**చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం మాట్లాడుతూ....**

రామడుగు లో ఉన్న గాయత్రి పంప్ హౌస్ నుంచి నీటి లిఫ్టింగ్ ప్రారంభించి నీరు విడుదల చేస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.80 నుంచి 90 శాతం ప్రజలు వ్యవసాయంపై ఆధారపడతారని గతంలో వైయస్సార్ ఎల్లంపల్లి నుంచి పైప్ లైన్ ద్వారా సాగునీరు సరఫరా చేసేందుకు ప్రణాళికలు రచించి నారాయణ పూర్ రిజర్వాయర్ 90 శాతం పనులు పూర్తి చేశారని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎం.డి. సివిల్ సప్లై చౌహాన్,సంబంధిత అధికారులు,ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఉమ్మడి భార్య అక్కడి సంప్రదాయం

**తెలంగాణ చౌరస్తా వెబ్ డెస్క్ :** హిందూ పురాణాల్లో ద్రౌపది పాండవులందరికీ భార్య. ఒకరు చేసుకున్న వ్యక్తే మిగిలిన వారికీ ఆలి అవుతుంది అక్కడ. అచ్చం ఇదే విధానం పాటించే కొన్ని తెగల వారు భారతదేశంలోనే ఉన్నారు. ముఖ్యంగా హిమాచల్‌ప్రదేశ్‌లోనూ, ఉత్తరాఖండ్ సరిహద్దుల్లో నివసించే హత్తి గిరిజన తెగ వారు దీన్ని తరాలుగా అనుసరిస్తున్నారు. ఇప్పుడు పెండ్లి చేసుకున్న సునీత చౌహాన్, కపిల్ నేగి, ప్రదీప్‌లు కూడా ఇదే తెగకు చెందిన వారు. తమ సంప్రదాయాన్ని ఘనంగా చాటుకోవాలన్న ఉద్దేశంతోనే మూడు రోజుల పాటు అట్టహాసంగా పెండ్లి జరుపుకున్నట్టు వాళ్లు ప్రకటించుకున్నారు. ఇదే ప్రాంతంలో ఉండే ఖాసాలుగా పిలిచే మరో తెగవాళ్లతో పాటు తమిళనాడు రాష్ట్రంలోని నీలగిరి ప్రాంతంలో ఉండే తోడా గిరిజనులు కూడా ఈ బహు భర్తృత్వాన్ని పాటిస్తారు. ఇంగ్లిషులో దీన్ని ఫ్రాటర్నల్ పాలియాండ్రీ... అని పిలుస్తారు. దీని ప్రకారం అన్నదమ్ముల్లో పెద్దవాడు ఏ అమ్మాయిని చేసుకుంటే ఆమె మిగతా వాళ్లందరికీ భార్య అవుతుంది. ఒకే తల్లికి పుట్టిన బిడ్డలే కాకుండా వేరు వేరు తల్లులకు పుట్టిన ఒకే కుటుంబానికి చెందిన అన్నదమ్ములూ ఇలా పెండ్లి చేసుకోవచ్చు. ఇద్దరు నుంచి నలుగురు, ఐదుగురు ఇలా సంఖ్య ఏదైనా కావచ్చు. ఇళ్లలో శుభకార్యం జరిగినప్పుడు కూడా భర్తలంతా ఆమె పక్కన కూర్చుంటారు. ఆమె పుట్టింటి వాళ్లు ఊరివాళ్లు కూడా అందరికీ సమానంగా అల్లుడి గౌరవం ఇస్తారు.

**కారణాలు... చట్టాలు...**

సాధారణంగా ఈ తెగలన్నింటిలో జనం ఎక్కువగా కొండ ప్రాంతాల్లో నివసిస్తారు. అక్కడ భూమిని పంచుకోవడం అన్నది సమస్యాత్మకంగా ఉంటుంది. ఎగుడు దిగుడు నేలలతో పాటు నీటి లభ్యతలోనూ తేడాలుంటాయి. దానికి తోడు పేదరికం, చిన్న భూకమతాలు ఉండే కుటుంబాలు ఎక్కువ. కాబట్టి వాటిని పంచుకోవడం సమస్యగా మారకుండా ఒక కుటుంబంలోని వాళ్లంతా ఉమ్మడిగా ఉండేందుకు ఒకే ఆలిని కట్టుకుంటారన్నమాట. భూమిని కాపాడుకోవడం కోసమే కాదు, కొండ ప్రాంతాల్లో మంది బలం ఉండటం అన్నది భద్రత పరంగా చాలా ముఖ్యం. ఒకే ఇంట్లో ఎక్కువ మంది మగవారు ఉన్నారంటే ఆ కుటుంబం ఎక్కువ బలంగా ఉన్నట్టు లెక్క. అలాగే ఒకే తల్లికి జన్మించినా, లేదా వేరు వేరు తల్లులకు చెందిన వాళ్లయినా సరే అన్నదమ్ముల మధ్య సఖ్యతను ఏర్పరచి ఉమ్మడి కుటుంబాలను నిలబెట్టడానికి ఈ పద్ధతి ఉపయోగపడుతుందని అక్కడి వాళ్లు నమ్ముతారు. ఇక, ఒక్కొక్కరూ ఒక్కో అమ్మాయిని పెండ్లి చేసుకుని ఒక్కో కుటుంబాన్నీ పోషించే స్తోమత లేకపోవడంలాంటి ఆర్థికపరమైన కారణాలూ ఇక్కడ కనిపిస్తాయి. ఇక, ప్రభుత్వ పరంగా చెప్పాలంటే హిమాచల్ ప్రదేశ్ రెవెన్యూ చట్టాల ప్రకారం జోడిదార్‌గా పిలిచే వీళ్ల వివాహాలకు గుర్తింపు ఉంది. ఆమెకు పిల్లలు పుట్టాక వాళ్లని ఒక్కో భర్త ఆ పిల్ల లేదా పిల్లాడిని తమ బిడ్డగా దత్తత తీసుకునే తరహా కార్యక్రమం చేస్తారు. దాని ఆధారంగానే సర్టిఫికెట్లలో బిడ్డకు తండ్రి పేరు రాస్తారట. పుట్టుక నుంచి చావు దాకా ఈ తెగల్లో ఇలాంటి చిత్రమైన వ్యవహారాలెన్నో ఉన్నాయి. సోషల్‌మీడియా కారణంగా ఇది నలుగురిలోకీ వచ్చింది కానీ ఈ ఆచారాలు తరాల నాటివన్న మాట!



## గవర్నర్ చేతుల మీదుగా పేట కలెక్టర్ కు అవార్డ్

**నారాయణపేట, తెలంగాణ చౌరస్తా:** నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా అవార్డ్ అందుకున్నారు. నీతీ ఆయోగ్ సంపూర్ణ అభియాన్ కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించినందుకు హైదరాబాద్ లోని రాజ్ భవన్ లో అవార్డులను అందజేశారు. నర్వ మండల బ్లాక్ లో పోషకాహారం, సామాజిక అభివృద్ధి, ఆరోగ్యం మొత్తం ఆరు సూచికలలో ఐదింటిని పకడ్బందీగా చేపట్టడంతో వెండి పతకం వచ్చింది. ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం కూడా పాల్గొన్నారు.

# పాలనలో మహిళా సాధికారతకు ప్రాధాన్యం

**తరువాయి భాగం**

చేశారు. పార్టీ కోసం కష్టపడే కార్యకర్తలకు పదవులు ఇస్తామని ఉద్ఘాటించారు. కొత్త వారు వచ్చినా పాత నేతలకు పార్టీలో ప్రాధాన్యం ఉంటుందని చెప్పుకొచ్చారు. కార్యకర్తలను కాపాడుకునే బాధ్యత తమదని హామీ ఇచ్చారు. ఆదివారం నిజామాబాద్‌లో కాంగ్రెస్ ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో టీపీసీసీ అధ్యక్షులు మహేష్‌గౌడ్ పాల్గొని మాట్లాడారు. పాలనలో మహిళా సాధికారతకు ప్రాధాన్యం ఇస్తున్నామని మహేష్‌కుమార్ గౌడ్ వెల్లడించారు. బోధన్ షుగర్ ఫ్యాక్టరీపై అధ్యయనం జరుగుతోందని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమక్షంలో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆదేశాలతోనే పాదయాత్ర ఉంటుందని క్లారిటీ ఇచ్చారు. ఈ పాదయాత్రపై కొన్ని మీడియా సంస్థలు తప్పుడు రాతలు రాస్తున్నాయని మండిపడ్డారు. ప్రజలకు చేరువయ్యేందుకే పాదయాత్రలు చేస్తున్నామని ఉద్ఘాటించారు మహేష్ కుమార్ గౌడ్. మాజీ సీఎం కేసీఆర్ అప్పులు చేసి ఫామ్ హౌస్‌కు పరిమితమయ్యారని మహేష్ కుమార్ గౌడ్ విమర్శించారు. బీఆర్ఎస్‌వి కుల రాజకీయాలని ఆక్షేపించారు. బనకచర్ల ప్రాజెక్టుపై మాజీ మంత్రులు కేటీఆర్, హరీష్‌రావు అబద్ధాలు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నేతలు సోషల్ మీడియా ద్వారా ఎల్లో జర్నలిజం నడిపిస్తున్నారని ఆరోపించారు. ఎమ్మెల్సీ కవిత ఏ పార్టీలో ఉన్నారో చెప్పాలని ప్రశ్నించారు. అధికారంలో ఉండగా ఏనాడైనా బీసీల గురించి కవిత మాట్లాడారా అని మహేష్‌కుమార్ గౌడ్ నిలదీశారు.

## ఆపరేషన్ సిందూర్
# కొత్త చరిత్రను సృష్టించింది

**తరువాయి భాగం**

చెప్పుకొచ్చారు. ఆదివారం గచ్చిబౌలిలో సెల్యూటింగ్ అవర్ హీరోస్ కార్యక్రమం నిర్వహించారు. వాయిస్ ఆఫ్ హైదరాబాద్ అకాడమీషియన్స్ ఆధ్వర్యంలో సెల్యూటింగ్ అవర్ హీరోస్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. డీఆర్టీవో చైర్మన్ సతీష్‌రెడ్డి, పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడారు. పెహల్గాం దాడుల్లో అమరులైన వీరులను స్మరిస్తూ వాయిస్ ఆఫ్ హైదరాబాద్ అకాడమీషియన్స్ కార్యక్రమం నిర్వహించడం మంచి పరిణామమని కొనియాడారు వెంకయ్య నాయుడు.
ఈ కార్యక్రమానికి వచ్చినందుకు చాలా సంతోషంగా ఉందని వెంకయ్య నాయుడు తెలిపారు. కులాన్ని, మతాన్ని, భాషను, వర్గాన్ని ఉపయోగించి కొన్ని సంస్థలు గొడవలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నాయని విమర్శించారు. నీరు, నింగి, నేల ప్రతి దానికి శక్తి ఉందని తెలిపారు. భారతదేశానికి పోరాడే శక్తి ఉందని.. భారత ప్రభుత్వం ఎప్పటికీ మన దేశ పౌరుల కోసం మాత్రమే పనిచేస్తోందని.. ఇతర దేశాల ఒత్తిడికి లొంగదని ఉద్ఘాటించారు. ఎవరి పని వాళ్లు చిత్తశుద్ధితో చేస్తే అదే దేశభక్తి అవుతుందని సూచించారు. సిందూర్, మహదేవ్ ఆపరేషన్లలో పాల్గొన్న త్రివిధ దళాలకు శుభాకాంక్షలు తెలిపారు. 22 నిమిషాల్లోనే లక్ష్యాన్ని ఛేదించడం, సిందూర్, మహదేవ్ ఆపరేషన్‌లని ముగించడం అద్భుతమని




ప్రశంసించారు. ఏబీఆర్ఎస్ఎం అనేది ఒక టీచర్స్ యూనియన్ అని... అయినప్పటికీ ఈ సంస్థ దేశభక్తి కోసం కృషి చేయడం అభినందనీయమని కీర్తించారు. ఆపరేషన్ సిందూర్ కొత్త చరిత్రను సృష్టించిందని ఉద్ఘాటించారు. పెహల్గాంకు బదులుగా భారతసైన్యం ఆపరేషన్ మహదేవ్ చేపట్టి పెహల్గాం ఉగ్రవాదులను మట్టుపెట్టారని పేర్కొన్నారు వెంకయ్య నాయుడు.
ఆపరేషన్ సిందూర్ కేవలం పాకిస్థాన్ ఉగ్రవాద స్థావరాలను లక్ష్యంగా చేసుకుని దాడి చేయడం కాదని వెంకయ్య నాయుడు వెల్లడించారు. సాధారణ పౌరులకు ప్రమాదం లేకుండా ఆపరేషన్ చేపట్టడం త్రివిధ దళాల ప్రతిభకు నిదర్శనంగా చెప్పొచ్చని వ్యాఖ్యానించారు. ఆపరేషన్ సిందూర్‌కు చాలా దేశాలు ఇండియాకు మద్దతిచ్చాయని చెప్పుకొచ్చారు. మూడు దేశాలు మాత్రమే ఆపరేషన్ సిందూర్‌ను వ్యతిరేకించాయని తెలిపారు. పాకిస్థాన్ చేసే ఎదురు దాడులను భారత త్రివిధ దళాలు సమర్థవంతంగా తిప్పికొట్టాయని ప్రశంసించారు. ఆపరేషన్ సిందూర్ ఆత్మనిర్భర్ భారత్ ప్రాజెక్ట్‌కు ఆదర్శంగా నిలిచిందని వెంకయ్యనాయుడు పేర్కొన్నారు.

## ధర్మస్థలలో అసహజ మరణాల
# రికార్డులన్నీ మాయం

- దేశవ్యాప్తంగా ఆందోళన
- 2000 నుంచి 2015 మధ్య బెళ్తంగడి పోలీస్ స్టేషన్‌లో అదృశ్యమైన మహిళలు
- 15 ఏళ్లలో అసహజ మరణాలు
- రికార్డులన్నీ ఒక క్రమ పద్ధతిలో మాయం
- జయంత్ అనే ఆర్టీఐ కార్యకర్త దరఖాస్తు ద్వారా వెల్లడి

**తెలంగాణ చౌరస్తా, నేషనల్ బ్యూరో :** ధర్మస్థల ఘటన దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించింది. ఈ కేసులో మరో సంచలనం చోటు చేసుకుంది. ఈ కేసులో మరో సంచలనం చోటు చేసుకుంది. ఈ ధర్మస్థలలో దాదాపు 15 ఏళ్లలో చోటు చేసుకున్న అసహజ మరణాలకు సంబంధించిన రికార్డులన్నీ మాయమయ్యాయి. ఈ విషయం ఆర్టీఐ చట్టం ద్వారా ఆదివారం బహిర్గతమైంది. 2000 నుంచి 2015 మధ్య బెళ్తంగడి పోలీస్ స్టేషన్‌లో అదృశ్యమైన మహిళలు, యువతులు, బాలికలకు చెందిన రికార్డులన్నీ గల్లంతయ్యాయి. ఈ మేరకు ఆర్టీఐ కార్యకర్త జయంత్ ఆదివారం వెల్లడించారు. ఇదే సమయంలో అనుమానాస్పద మరణాలపై ఎన్నో ఆరోపణలు వెల్లువెత్తాయని ఆయన గుర్తు చేశారు. అయితే తాను వందకు పైగా మహిళలు, యువతుల మృతదేహాలను పూడ్చిపెట్టానంటూ ఒక పారిశుద్ధ్య కార్మికులు ప్రకటించిన వేళ.. పోలీస్ స్టేషన్‌లో రికార్డులు మాయం కావడం సంచలనం సృష్టిస్తోంది. అదీకాక.. ఈ రికార్డులన్నీ ఒక క్రమ పద్ధతిలో మాయం చేసినట్లు ఆర్టీఐ దరఖాస్తు ద్వారా వెల్లడైందని జయంత్ పేర్కొన్నారు. అయితే ఇదే అంశంపై విచారణ జరుపుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)కు ఫిర్యాదు చేసినట్లు జయంత్ వివరించారు. ఒక యువతి మృతదేహాన్ని అక్రమంగా పాతపెట్టడం తాను చూశానని.. అధికారులు సైతం అక్కడే ఉన్నారని జయంత్ సంచలన విషయం వెల్లడించారు. ఈ నేపథ్యంలో సదరు మృతదేహాన్ని సిట్ అధికారులు వెలికి తీయాల్సి ఉందన్నారు. అయితే ఈ యువతుల గల్లంతుపై పోలీసుల పనితీరు తెలుసుకోవడానికి చాలా కాలంగా ఆర్టీఐను ఆశ్రయిస్తున్నట్లు చెప్పారు. ఆ క్రమంలో ఆచూకీ గల్లంతైన వ్యక్తులు, వారి ఫొటోలను తాను చాలా కాలం క్రితమే బెళ్తంగడి పోలీసులను అడిగినట్లు తెలిపారు.ఈ వ్యవహారానికి సంబంధించిన ఫొటోలు, వాల్ పోస్టర్లు, పోస్ట్‌మార్టం నివేదికలు అన్ని ఒక పథకం ప్రకారం పోలీసులు నాశనం చేశారని వివరించారు జయంత్. దీనిపై శనివారం సిట్ అధికారులకు ఫిర్యాదు చేశానన్నారు. గతంలో యువతి మృతదేహం పోలీసులకు లభించిందని.. అయితే వారు ఆ మృతదేహాన్ని అత్యంత దారుణంగా పాతిపెట్టారని చెప్పారు. ఇప్పుడు మృతదేహాలకు సంబంధించిన అవశేషాలు లభించినా.. వాటిని వేటితో సరి పోల్చుతారని ఆర్టీఐ కార్యకర్త జయంత్ ప్రశ్నించారు. ఈ వ్యవహారం వెనుక ఎవరు ఉన్నారంటూ ఆయన సందేహం వ్యక్తం చేశారు. దీనిపై ఇంతగా ఎవరు ప్రభావం చూపించారని ప్రశ్నించారు. ఈ రికార్డులను కంప్యూటర్ బ్యాక్ అప్ ద్వారా వెనక్కి తీయాల్సిన అవసరం ఉందని జయంత్ అభిప్రాయపడ్డారు.



మ్యాన్ ఆఫ్ మాసెస్ ఎన్టీఆర్ వరుస సక్సెస్‌లతో ఫుల్ జోష్ మీదున్నారు. ఆఖరిగా దేవర సినిమాతో సక్సెస్ అందుకున్న ఎన్టీఆర్, ఇప్పుడు ఓ వైపు వార్2 సినిమాను రిలీజ్ కు రెడీ చేస్తూనే మరోవైపు ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ సినిమాను చేస్తున్నారు. ఇందులో వార్2 ఆగస్ట్ 14న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఎన్టీఆర్ ఈ సినిమాతోనే బాలీవుడ్ ఎంట్రీ ఇవ్వబోతున్నారు.అయాన్ ముఖర్జీ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో బాలీవుడ్ గ్రీక్ గాడ్ హృతిక్ రోషన్ తో కలిసి జూ. ఎన్టీఆర్ స్క్రీన్ షేర్ చేసుకోనున్నారు. బాలీవుడ్ బ్లాక్ బస్టర్ వార్ సినిమాకు సీక్వెల్ గా తెరకెక్కుతున్న వార్2 పై అందరికీ భారీ అంచనాలున్నాయి. భారీ హైప్ ఉన్న ఈ సినిమా నుంచి రీసెంట్ గా ట్రైలర్ రిలీజవగా అది అప్పటివరకు ఉన్న అంచనాలను తారాస్థాయికి చేరేలా చేసింది.వార్2 ను పూర్తి చేసిన తారక్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఓ యాక్షన్ థ్రిల్లర్ ను చేయనున్న సంగతి తెలిసిందే. శరవేగంగా షూటింగ్ జరుపుకుంటున్న ఈ సినిమా కోసం ఎన్టీఆర్ చాలా స్టైలిష్ గా తయారయ్యారు. అయితే ఈ సినిమాను నవంబర్ లేదా డిసెంబర్ కల్లా పూర్తి చేయాలని తారక్ ప్లాన్ చేస్తున్నారట. డ్రాగన్ అనే వర్కింగ్ టైటిల్ తో తెరకెక్కుతున్న ఈ సినిమా తర్వాత తారక్ దేవర2 ను చేయబోతున్నారు.అందులో భాగంగానే కొరటాల ప్రస్తుతం దేవర2కు సంబంధించిన స్క్రిప్ట్ వర్క్, ప్రీ ప్రొడక్షన్ వర్క్ లో బిజీగా ఉన్నారట. అంతా అనుకున్నట్టు జరిగితే దేవర2 సినిమా జనవరి లేదా ఫిబ్రవరి నుంచి షూటింగ్ మొదలు పెట్టాలని చూస్తున్నారట కొరటాల. దేవర సినిమాకు సీక్వెల్ గా తెరకెక్కనున్న ఈ సినిమాలో మొదటి భాగంలో ఉన్న చాలా ప్రశ్నలకు సమాధానం దొరకనుండటంతో దేవర2పై భారీ హైప్ నెలకొంది.

## దేవర2 మొదలయ్యేదప్పుడే!



## తమన్నా సెటైర్:

ఒక రోజు క్రికెటర్ తో .. మరో రోజు సహనటుడితో.. ఇంకోరోజు డాక్టర్- బిజినెస్‌మేన్‌తో... ఇకపైనా ఎవరితో ముడిపెడతారో తెలీదు! మొత్తానికి తమన్నా ఎవరో ఒకరిని పెళ్లాడేయబోతోందనే పుకార్లు ఇప్పటికీ ఆగడం లేదు. తమన్నా భాటియా- విజయ్ వర్మ ప్రేమాయణం, జంట షికార్ల గురించి చాలా కాలం పాటు ప్రచారం సాగింది. కానీ ఈ జంట బ్రేకప్ అవ్వడం అభిమానులకు షాకిచ్చింది. ఇది ఊహించనిది. కానీ కాలంతో పాటే గతించిపోయే శాశ్వత నిజం.అయితే తమన్నాను ఇప్పటికీ మీడియాలు వదిలి పెట్టడం లేదు. మిల్కీ వైట్ బ్యూటీకి ఇంట్లోవాళ్లు పెళ్లి సంబంధాలు వెతుకుతున్నారంటూ నెటిజనుల్లో నిరంతరం ప్రచారం సాగుతూనే ఉంది. కథానాయికల విషయంలో ఇలాంటి ప్రచారం సహజమే అనుకున్నా, నిప్పు లేదా పొగ ఈ రెండిటిలో ఏ ఒక్కటీ లేకపోయినా ఇలాంటివి ఎలా పుట్టిస్తున్నారో ఎవరికీ అర్థం కాని గందరగోళాన్ని సృష్టిస్తోంది. ఒకానొక సందర్భంలో తమన్నా మాట్లాడుతూ.. తనపై సాగుతున్న తప్పుడు ప్రచారాన్ని తట్టుకోలేకపోయానని అన్నారు. ఒకసారి పాకిస్తాన్ క్రికెటర్ అబ్దుల్ రజాక్ తో ముడిపెట్టారని కూడా ఆవేదన చెందారు. అబ్దుల్ రజాక్ నేను ఓ ఆభరణాల దుకాణం ఓపెనింగులో కలిసాం. ఆ షాప్ పేరేమిటో తెలీదు కానీ, అతడిని నేను కలిసాను అని నెటిజనులు రాసారు. రజాక్ ని పెళ్లాడుతున్నానని కూడా ప్రచారం చేసారు. ఓ పాడ్ కాస్ట్ లో ఈ విచిత్రమైన ప్రచారం గురించి ప్రస్తావిస్తూ తమన్నా కొంత ఇబ్బందికరంగా ఫీలైంది. సహ నటుడు, డాక్టర్ లేదా క్రికెటర్ తో నన్ను ఎవరో ఒకరితో ముడి వేస్తారు. నేను నా భర్త షాపింగ్ లో ఉన్నామనే భావన తెచ్చేస్తారు. ప్రేమలో ఉండటం అనే ఆలోచన నాకు చాలా ఇష్టమే అయినా కానీ, నా వ్యక్తిగత జీవితం విషయానికి వస్తే నేను నిరాధారమైన వార్తలను అంగీకరించను. నేను ప్రస్తుతం ఒంటరిగా సంతోషంగా ఉన్నాను. నా తల్లిదండ్రులు వరుడి కోసం వెతుకులాటలో లేరు..! అని కూడా తమన్నా తనపై తప్పుడు ప్రచారాన్ని ఖండించారు.నేను ప్రస్తుతం ఒంటరిగా ఉన్నాను.. ఒకవేళ ప్రేమలో పడ్డాను అంటే అది కేవలం సినిమాలతో మాత్రమే. నిరంతరం సినిమాల్లో నటించేందుకు వెతుకుతూనే ఉంటాను. అసలు ఈ ఊహాగానాలు ఎక్కడి నుంచి పుట్టుకొస్తాయో కానీ ఒక్కటీ నిజం కాదు. నేను నా మార్గంలో వెళుతున్నాను. ఒకవేళ గౌరవనీయమైన వివాహవ్యవస్థలోకి అడుగుపెడితే కచ్చితంగా అందరికీ చెబుతాను. నాపై తప్పుడు కథనాలు రాయడం అగౌరవం అని కూడా తమన్నా నాటి పాడ్ కాస్ట్ లో వ్యాఖ్యానించారు.



కోలీవుడ్ సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ అనిరుద్ రవిచందర్ తెలుగులో కూడా అదరగొడుతున్నాడు. అనిరుద్ మ్యూజిక్ ఇస్తున్న సినిమా అంటే చాలు సాంగ్స్ సూపర్ హిట్ తో పాటు బిజిఎం అదిరిపోతుందని ఫిక్స్ అవుతున్నారు. ఐతే అనిరుద్ ఏం చేసినా సరే అదో సంచలనం సృష్టిస్తుంది. ముఖ్యంగా సూపర్ స్టార్ రజినీకాంత్ కి ఇస్తున్న మ్యూజిక్ అయితే వేరే లెవెల్ అనిపిస్తుంది. అఫ్కోర్స్ అనిరుద్ అందరి హీరోలకు కూడా అదే రేంజ్ మ్యూజిక్ ఇస్తాడు. రజినీ మీద ఉన్న ప్రేమ అభిమానం కొద్దీ ఆయన సినిమాలకు ఇంకాస్త ఎక్కువ ఇంపాక్ట్ చూపిస్తాడు.ఐతే ఈమధ్యనే అనిరుద్ ఒక పాడ్ కాస్ట్ ఇంటర్వ్యూలో పాల్గొన్నాడు. రజినీ కూలీ సినిమాకు తాను ఇచ్చిన మ్యూజిక్ కి వస్తున్న రెస్పాన్స్ కి సూపర్ హ్యాపీ గా ఉన్నాడు అనిరుద్. ఐతే ఆ సినిమాలో ఒక సాంగ్ కోసం తాను చాట్ జిపీటీ సజెషన్ తీసుకున్నా అని అన్నాడు అనిరుద్. ఆడియన్స్ ని ఇంప్రెస్ చేయడానికి ఒక కంపోజిషన్ దగ్గర తాను ఆగిపోగా ఆ టైం లో చాట్ జీపీటీ హెల్ప్ తీసుకున్నా. అది ఇచ్చిన ఒక 10 ఆప్షన్స్ లో ఒకటి తనకు ఉపయోగపడిందని అన్నాడు అనిరుద్. సో అనిరుద్ చేసిన కూలీ సినిమాలో ఒక సాంగ్ చాట్ జీపీటీ ఇచ్చిన హెల్ప్ తోనే చేశాడన్నమాట. ఐతే అదేంటి అన్నది మాత్రం అనిరుద్ రివీల్ చేయలేదు. మొత్తానికి చాట్ జీపీటీని వాడి అనిరుద్ ఇలా ఒక కంపోజిషన్ పూర్తి చేయడం ఫ్యాన్స్ ని సర్ ప్రైజ్ చేసింది. అనిరుద్ ఇలాంటివి బయటకి చెప్పడం కూడా ఆడియన్స్ ని షాక్ అయ్యేలా చేస్తుంది.సాధారణంగా అయితే ఇలాంటివి చేసినా ఎక్కడ తన పేరుకి భంగం కలుగుతుందో అని బయటకు చెప్పరు. కానీ అనిరుద్ మాత్రం అలాంటివేవి ఆలోచించకుండా చేశాడు. తెలుగులో ఈమధ్యనే వచ్చిన కింగ్ డమ్ సినిమాకు అనిరుద్ మ్యూజిక్ ఇచ్చాడు. ఆ సినిమాలో అనిరుద్ మ్యూజిక్ హైలెట్ అయ్యింది.

## ఆ మాట చెప్పడానికి గట్స్ ఉండాలబ్బా..!